www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 నవంబర్ 2023
5
వైఎస్ఆర్



7 నుంచి శాస్త్రీయ దృక్పథంపై ప్రచారం

కడప అర్బన్ : శాస్త్రీయ దృక్పథ ప్రచారం రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7న ప్రారంభిస్తున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో జెవివి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.వి. రామన్ జయంతి (ఫిబ్రవరి 28) వరకూ పాఠశాలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్నారని చెప్పారు. చెకుముకి సంబరాలను ప్రపంచ సైన్స్ దినోత్సవం ఈనెల 10న ఉంటుందన్నారు. సైన్స్ టెక్నాలజీ అభివృద్ధి అవుతున్న నేపథ్యంలో విద్యా, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా తదితర రంగాలలో శాస్త్ర పరిశోధనలలో కొత్త పుంతలు తొక్కుతున్న ఇటువంటి పరిస్థితులలో ఆశాస్త్రీయ భావనలు, మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్ర విజ్ఞానంలో డార్విన్ పరిణామవాదం, మెండలీస్ ఆవర్తన పట్టిక లాంటివి పాఠ్య అంశాలలో తొలగించి, జ్యోతిష్య శాస్త్రాన్ని యూనివర్సిటీలలో పాఠ్య అంశాలుగా చేస్తున్నారని వాపోయారు.

పేదల ఇళ్లు కూల్చిన తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

- అంబేద్కర్ విగ్రహం వద్ద వంటావార్పుతో బాధితుల నిరసన
- నష్టపరిహారం ఇవ్వాలి డిమాండ్

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

పేదల ఇళ్లను కూల్చిన తహశీల్దార్ గంగయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి. అన్వేష్ డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో బాధితులు వంటా వార్పు కార్యక్రమంతో తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం జి.బి (గుంటూరు బాపనయ్య) నగర్ కాలనీలో నివాసం ఉన్న పేదలకు పట్టాలు మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. అప్పుసొప్పు చేసి కట్టుకున్న ఇళ్లను ఇప్పుడు కూల్చివేయడం దారుణమని వాపోయారు. కూల్చిన ఇళ్లకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రంగసముద్రం రెవెన్యూ పొలంలో అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించడం, బోగస్ పట్టాలు సృష్టించడం, ప్లాట్లు వేసి చట్ట విరుద్ధంగా విక్రయిస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం తగదన్నారు. పోరుమామిళ్ల చుట్టం ప్రక్కల గ్రామాల్లో పేదలు ఉపాధి కోసం వలస వచ్చి ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే అధికారులు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాల్సింది పోయి పోలీసుల సాయంతో కూల్చివేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. పట్టణానికి వలస వచ్చిన భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, హమాలీలు, తోపుడు బండి కార్మికులు, పేదలు సిపిఎం అండతో ఇళ్లు నిర్మించుకోవడం తప్పా అని పేర్కొన్నారు. పేదల ఇళ్లను కూల్చిన రెవెన్యూ అధికారి వైఖరికి నిరసనగా సోమవారం తహశీల్దార్ కార్యాలంయ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, అవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, బాధితులు గురమ్మ, లక్ష్మి దేవి, సుధాకర్ ,రమణయ్య, నాగయ్య, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు షేక్ గౌసియాబేగం, బీబీ, లూర్దుమేరీ, వరలక్ష్మీ, ఆటో యూనియన్ మండల కార్యదర్శి చిన్నయ్య, చిన్నప్ప, ప్రసాద్ సుందరయ్య, కంటా శ్రీను వంటశీను, ప్రసాదు,రత్నం బాలగురయ్య, మున్నీ, మాబున్నీ, కాలనీవాసులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద వంటా వార్పుతో నిరసన తెలియజేస్తున్న బాధితులు, సిపిఎం నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా విమర్శ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా విమర్శించారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో విద్యా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పాలకుల సంస్కరణలు ప్రయివేట్, కార్పొరేట్ శక్తులకు అనుకూలముగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా రంగ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే ఇప్పటికే ప్రాథమిక విద్యకు పాడె కట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరుస్తూనే, మరోపక్క ప్రభుత్వ విద్యా రంగం బలహీనపడేందుకు కుట్రలు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ విద్యా రంగానికి చేసిన మేలేమీ లేదన్నారు. పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులను మరింత సంక్షోభంలోకి నెట్టే జిపిఎస్ విధానాన్ని అమలు చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ ను సైతం ఉద్యోగుల అవసరాలకు రుణాల రూపంలో ఇవ్వకపోవడం దుర్మార్గపు చర్య అని ఆయన పేర్కొన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో జగన్ సర్కార్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చేసిన మేలు ఒకటి కూడా లేదన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి ప్రభుత్వం అని పేర్కొంటూనే ఉద్యోగులను నిలువునా దగా చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, సహాధ్యక్షులు వై.రవికుమార్, పి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎల్.చంద్ర ఓబుళ్ రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు బి.రాజశేఖర్ రాహుల్, ఏ.డి.దేవదత్తం, సరస్వతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

మహిళా క్రికెట్ జట్టుకు ప్రశంస ఎంపిక

ప్రజాశక్తి - కడప



అండర్ – 15 ఆంధ్ర రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు కడప జిల్లాకు చెందిన ప్రశంస ఎంపికైంది. వెంకటగిరిలో నిర్వహించిన ఎసిఎ సౌత్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లలో బౌలింగ్‌లోనూ, బ్యాటింగ్‌లోనూ ప్రశంస మంచి ప్రతిభ కనబరిచి ఆంధ్ర సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక అయింది. జిల్లాకు చెందిన ప్రశంస రాష్ట్ర దత్తుకు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ రెడ్డి, కార్యదర్శి రెడ్డి ప్రసాద్, డిసిఏ కాజా మైనుద్దీన్, ఉమెన్ కో–ఆర్డినేటర్ కళ్యాణదుర్గం విష్ణు మోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి

టిడిపిలో చేరిన మహిళలు

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి సమక్షంలో మహిళలు టిడిపిలో చేరారు. ఆదివారం రెండవ డివిజన్‌లో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవి రెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో వైసిపి చేస్తున్న అరాచకాలను చూడలేక చాలామంది టిడిపి వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపైన అక్రమంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రాక్షస ఆనందం పొందుతున్నాడని తెలిపారు. కడపలో వైసిపి అరాచకం ఎక్కువైపోయిందని చెప్పారు. యువతకు ఉద్యోగాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక తప్పకుండా మహిళలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. రాక్షస పాలనకు ఓటు అనే ఆయుధంతో చరమగీతం పాడాలని పిలుపు నిచ్చారు. ప్రతిఒక్కరూ టిడిపి గెలవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్ వైఖరి మార్చుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగుల పట్ల కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ భాషా ప్రయోగంలో వైఖరి మార్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కింది స్థాయి ఉద్యోగుల పట్ల అగౌరవంగా మాట్లాడడం సరికాదని తెలిపారు. రిమ్స్‌లో నిజాయితీ ఉద్యోగిని దూషించడం దారుణమని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికుల పట్ల వైఖరి మార్చుకోవాలని తెలిపారు. ఐఎఎస్ స్థాయిని దిగజార్చవద్దని పేర్కొన్నారు. కమిషనర్ వైఖరి పై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కమిషనర్‌కు అనుకూలంగా ఉన్న వారి పట్ల ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యువజన, విద్యార్థి సంఘం నాయకులు

కడప 'ఉక్కు'ను ప్రభుత్వమే నిర్మించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎస్.కె. మైనుద్దీన్, ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అరుణ్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మనోజ్, పిడిఎస్‌యు నగర కార్యదర్శి శ్రీనాథ్, ఆర్ఎస్ వైఎఫ్ నగర కార్యదర్శి లోకేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్ లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో బంద్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా ఎన్నేళ్లు రాయలసీమను కరువు సీమని చెప్పుకుందామని ప్రశ్నించారు. ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం వలసలు వెళదామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని చట్టం చేశారు కదా మరి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఇప్పటికి ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు మూడు శంకుస్థాపనలు, నాలుగు పునాదిరాళ్లు వేశారే తప్ప కనీసం రూ.300 కోట్లు కూడా నిధులు కేటాయించకుండా ఉక్కు పరిశ్రమ ఎలా నిర్మాణమవుతుందన్నారు. నిధులు కేటాయించకుండా మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చారని విమర్శించారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండ మోసం చేస్తున్న పాలకులపై దండయాత్ర చేయాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. ఎవరోవస్తారు.. ఏదో చేస్తారు అనుకుంటే పొరపాటే అవుతుందని తెలిపారు. మన హక్కుల కోసం పోరాడే సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, నగర ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, విజయ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శివగంగాధర్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తేజ, ఉదయ్ పాల్గొన్నారు.

రామ కథకు రమణీయతను అద్దిన 'మొల్ల'

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు రామాయణ తొలి కవయిత్రి మొల్లమాంబ రామ కథకు రమణీయతను అద్దారని, తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 'మొల్ల రామాయణ సౌందర్యం' అనే అంశంపై ప్రసంగించారు. వాల్మీకి రామాయణానికి వందలాది రామాయణాలు అనేకులు అనువదించినా, మొల్ల తన కవిత్వానికి రంగు,రుచి అద్దారని తెలిపారు. తెలుగులో భాస్కర రామాయణము, రంగనాథ రామాయణము, కట్టా వరదరాజ రామాయణము, గోపీనాథ రామాయణము, వాసుదాసు రామాయణము, శ్రీమద్రామాయణ కల్ప వృక్షము, సరస్వతి రామాయణము, గోవింద రామాయణము మొదలగునవి రచించినా మొల్ల రామాయణానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. మొల్ల రామాయణం మహిళా సాధికారతకు, స్త్రీ ఔన్నత్యానికి పెద్దపీట వేసి మొల్ల మహిళా లోకానికే గౌరవం పెంచిందన్నారు. సభాధ్యక్షులు మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల రామాయణ పద్యాలలో మల్లెపువ్వు పరిమళం గుబాళిస్తుంటుంది అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి యన్ రామమూర్తి నాయుడు, పలువురు పాల్గొన్నారు.

విత్తన నాణ్యతకు పెద్దపీట

40 శాతం సబ్సిడీతో బుడ్డశనగ విత్తనం
ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ కె.జగదీష్ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



నాణ్యమైన విత్తన సరఫరా చేయడానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి యేటా ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు, బుడ్డశనగ, పచ్చిరొట్ట విత్తనాలు వంటి పలు పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాన్ని సేకరించడం తెలిసిందే. ఇందులోభాగంగా ఈయేడాది కర్నూలు జిల్లా నుంచి నాణ్యమైన విత్తనాన్ని సేకరించాం. బుడ్డశనగ విత్తనాన్ని 40 సబ్సిడీతో ఆర్‌బికెల ద్వారా రైతాంగానికి అంద జేస్తున్నాం. ఎపిసీడ్స్ మార్కెట్లో ఉన్న కారణంగా బయటి మార్కెట్లో ధరలు స్థిరంగా కొనసాగుతాయని, లేని పక్షంలో ధరలు అమాంతంగా పెరిగే అవ కాశాలు ఉన్నాయి. ఎపిసీడ్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లో ధరల స్థిరీ కరణ కొనసాగుతుందని ఘంటాపథంగా చెప్పవచ్చనడంలో సందేహం లేదని పేర్కొంటున్న ఎపి సీడ్స్ మేనేజర్ కె. జగదీష్‌తో ముఖాముఖి..

ముఖాముఖి..

విత్తన కొనుగోళ్ల గురించి తెలపండి?

కర్నూలు జిల్లాలో ఎంపిక చేసిన పొలాల నుంచి సరసమైన ధర ప్రాతిపదికన రైతుల నుంచి విత్తనాన్ని సేకరించాం. ఈఏడాది కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 70 వేల క్వింటాళ్ల ఎపి సీడ్స్ మార్కెట్ ప్రవేశం కారణంగా బహిరంగ మార్కెట్లో ధరలు అదుపులో ఉండటాన్ని ప్రత్యక్షంగా గమనించొచ్చు.

ప్రొక్యూర్‌మెంట్ గురించి చెప్పండి?

విత్తన సేకరణకు సంబంధించి టెండర్లు పిలుస్తాం. ఇందులో అర్హత కలిగిన కంపెనీని ఎపిసీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎంపిక చేస్తారు. ఈఏడాది వరద, వీరభద్ర, వెంకటసాయిలక్ష్మీ, విఘ్నేశ్వర, గంగాధర అగ్రిటెక్, సుబ్రమణ్యేశ్వర, వెంకటే శ్వర ఏజెన్సీలు దక్కించుకున్నాయి. రెండు, మూడు విడతల్లో ల్యాబ్ టెస్టింగ్ అనంతరం నాణ్యతను నిర్ధారిం చడం జరుగుతుంది.

విత్తన నాణ్యత నిర్ధారణ ఎలా?

ప్రభుత్వ నిబంధనల మేరకు టెస్టింగ్, స్క్రీనింగ్, ఆస్పెక్టెడ్ వంటి సదుపాయాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయడం జరుగుతుంది. అనంతరం అగ్రి ల్యాబ్‌ల్లో పరిశీలన చేసిన అనంతరం పంపిణీ చేస్తాం.

విత్తన సరఫరా గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఆర్బీకేలకు టెండరు దక్కించుకున్న ఏజెన్సీలు తమ వాహనాల ద్వారా సరఫరా చేయడం జరుగుతోంది. గతేడాది నుంచి కడప జిల్లాలో 280 ఆర్బీకేలు, అన్న మయ్య జిల్లాలో 3 90 ఆర్బీకేలకు సరఫరా చేయడం పరిపాటిగా మారింది.

సబ్సిడీ తగ్గుదలకు కారణమేమిటి?

విత్తన సబ్సిడీ హెచ్చుతగ్గులు ప్రభుత్వ పరిధిలోని అంశం. ఈయేడాది 40 శాతం సబ్సిడీతో బుడ్డశనగ, సబ్సిడీతో పచ్చిరొట్ట నువ్వుల విత్తనం సబ్సిడీలతో అందజేస్తున్నాం.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, జెవివి నాయకులు

11న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప బాలోత్సవం అధ్వర్యంలో ఈనెల 11న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం పోస్టర్లను ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎస్‌విఇంజినీరింగ్ కళాశాలలో బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ చిత్రలేఖన పోటీలు నిర్వహించడం సంతోషదాయకం అన్నారు. ఈ కాలం చదువులు పిల్లలను మానసికంగా కృంగ తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాని నుంచి పిల్లలు బయటపడేందుకు ఇటువంటి కార్యకరమాలు తోడ్పడతాయన్నారు. పరిశ్రమల శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ బాలలు తమ బాల్యంలో పొందే అనుభూతులను భవిష్యత్‌లో తీపి జ్ఞాపకంగా బాలోత్సవం కార్యక్రమాలు ఉండాలన్నారు. ఆ అపురూపమైన ఆనందాన్ని తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించి వారిని ఉన్నత స్థాయికి వెళ్లేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు రాజశేఖర్ రాహుల్, లక్ష్మి రాజ, రచయిత రామసుబ్బమ్మ, వెంకటరామరాజు, రిమ్స్ నరసింహా రెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, కరస్పాండెంట్ వెంకట సుబ్బయ్య, యుగంధర్, త్రిమూర్తులు రెడ్డి, దేవదత్తం, విజయకుమార్, మహేష్, శ్రీరాములు, బాలబయన్న సరస్వతి, కామేశ్వరమ్మ, పద్మా, శివరామ్, పాల్గొన్నారు.

'సంక్షేమ పాలన అంటే సకాలంలో జీతాలు చెల్లించకపోవడమా'

ప్రజాశక్తి - బద్వేలు

సంక్షేమ పాలన అంటే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడమా అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం బద్వేలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన జీతాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రహసనంగా మార్చి వేసిందని విమర్శించారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పదే పదే ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందని ప్రకటిస్తూనే మరో పక్క జీతాలు చెల్లించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఆలస్యమైనా సరే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నాము కదా అని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర మాట్లాడటం తగదన్నారు. చేసిన పనికి ప్రతి నెలా ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలనే చట్టం ఉందని ఆర్థిక మంత్రికి తెలియదా అని పేర్కొన్నారు. ప్రతి నెలా ఉద్యోగులు జీతాల కోసం ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సి రావడం దారుణమన్నారు. పదేపదే అప్పులు తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఆదాయాన్ని ఏమి చేస్తుందో సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన బాట పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వాల దుర్మార్గాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - బద్వేలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న దుర్మార్గపు విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ముడియం చిన్ని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల ఆలోచనలు ప్రజల్లో కదులుతున్నాయని చెప్పారు. పాము తన పాత చర్మం వదిలి కొత్త చర్మం పొందినట్లుగా, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ప్రజాప్రతినిధులు బిజెపి వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. బిజెపితో స్నేహం చేస్తే వైసిపి, టిడిపిలు కాల గర్భంలో కలిసి పోతాయని తెలిపారు. పాలన దక్షిత, సామర్థ్యం లేని ప్రాంతీయ పార్టీలు ఢిల్లీ బిజెపి ముందు పిల్లుల్లా నిలుచున్నాయని పేర్కొన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ అభివృద్ధికి వచ్చిన రూ. 130 కోట్ల ప్రజాధనం ఎక్కువ శాతం పేదలు నివసించే ఏరియాలలో ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె.శ్రీను, కార్యదర్శివర్గ సభ్యులు బాబు, పట్టణ కమిటీ సభ్యులు రాజు, మోక్షమ్మ, అనంతమ్మ, శాఖా కార్యదర్శులు కైరున్ బీ, బాబయ్య, బాలయ్య, సుబ్బరాయుడు, శివ, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు మస్తాన్ షరీఫ్, నాగార్జున, ఆంజనేయులు ,సురేంద్ర, పార్టీ కార్యకర్తలు గౌతమి, రామలక్ష్మమ్మ, మస్తాన్ బీ, రత్తమ్మ, మాధవి,ఫాతిమా, నాగమ్మ, సుబ్బరాయుడు, శివకృష్ణ, కొండయ్య, హరి, సత్యరాజు పాల్గొన్నారు.

రేపు అసెంబ్లీ సమన్వయ కన్వీనర్ల సమావేశం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 7న మధ్యాహ్నం 2 00 గంటలకు పార్టీ అసెంబ్లీ సమన్వయ కన్వీనర్ల కీలక సమావేశం నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలకు సంబంధించిన అవసరమైన విషయాలను చర్చించి సమన్వయం చేయడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ముఖ్య సమావేశానికి అసెంబ్లీ సమన్వయ కన్వీనర్లు తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్



డిప్యూటీ సిఎంకు వినతి పత్రం అందజేసున్న దస్తగిరిరెడ్డి

కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. ఆదివారం 23వ డివిజన్ గడప గడప కార్యక్రమంలో ఉన్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో కరువు మండలాల పట్ల ముఖ్యమంత్రి దృష్టి సారించాలని తెలిపారు. దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కడప శివారు ప్రాంతం కెసి కెనాల్ ఆయకట్టు రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. గండికోట ప్రాజెక్టులో నీళ్లు ఉన్నాయని, పెన్నా నదికి నీళ్లు వదిలి ఆదిని మ్మాయపల్లి ఆనకట్ట ద్వారా కెసి కెనాల్‌కు విడుదల చేయాలని కోరారు. జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షా బావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. వర్షాభావ విపత్తుతో వేసిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయని, సన్న, చిన్న కారు, మధ్యతరగతి, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రబీ సీజన్ ప్రారంభమైందని ఇప్పటి వరకు వర్షమే కురవలేదని తెలిపారు. పంట పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయని, రబీ సీజనకు రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నా చినుకులు పడలేదని చెప్పారు. కరువు కోరల్లో కడప జిల్లా చిక్కుకున్నదని, రైతులకు భరోసా ఇచ్చే విధంగా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు గ్రామాలలో పర్యటించాలని కోరారు. కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడపఅర్బన్ : రాయలసీమ జిల్లాలో పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించినగాని కంటే అధికంగా వసూలు చేస్తున్నారని, విచారించి డిఇఒచర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో పిడిఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలకు నిలయంగా ఉన్న రాయలసీమ జిల్లాలో ఫీజుల దోపిడీనే కాకుండా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల చెందిన యాజమాన్యాలు తల్లిదండ్రులను దోపిడీ చేయడం బాధాకరమన్నారు. పదవ తరగతి పరీక్ష ఫీజు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.125 కానీ రాయలసీమ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యులు పదవ తరగతి పరీక్ష ఫీజును ఒక విద్యార్థితో రూ.1500 నుంచి రూ. 2 వేల వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి

-టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య

ప్రజాశక్తి-కడప సిటీ

దూదేకులు రాజకీయంగా ఎదగాలని టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల భవనంలో గగ్గుటూరు చిన్నరాజా అధ్యక్షతన టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్యకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ హిందు, ముస్లిమ్ సామాజిక కులాల మధ్య తీవ్ర అణచివేతకు గురవుతున్న జాతి దూదేకులేనని ఆందోళన వ్యక్తం చేశారు. దూదేకుల ముస్లిమ్ అనే గుర్తింపు లభిస్తుందన్నారు. సామాజికంగా వెనుకబడిన కులాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సంఘం నాయకులు ఖాదర్ బాషా మాట్లాడుతూ సమష్టి పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కార మవుతాయన్నారు. బిసి కులాల నుంచి ఉన్నత స్థాయికి ఎదగడం సాధారణ విషయం కాదన్నారు. సంఘం నాయకులు గౌతం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నాగూర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో హౌసింగ్ ప్లాట్లు ఇప్పించే ప్రయత్నం చేశామన్నారు. గుంటూరులో దూదేకుల సింహగర్జన వంటి సభల వల్ల గుర్తింపు లభిస్తుందన్నారు. దూదేకుల సంఘం నాయకులతో కలిసి పని చేశామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుదలకు ఎటువంటి పునాధి లేదన్నారు. ముఖ్యమంత్రి సహకారం అందించడం ద్వారానే గుర్తింపు వచ్చిందని చెప్పారు. బిసిలలోని 132 కులాలు ఉన్నాయన్నారు. బిసిలతోనే రాజ్యాధికారం సాధ్యమని తెలిపారు. నాయీబ్రాహ్మణ సంఘం తరుపున ఆరు జీవోలను సాధించుకున్నామని తెలిపారు. జిల్లాలో దూదేకులు బలమైన సామాజికవర్గంగా గుర్తింపు ఉందన్నారు. కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షులు, చెన్నకేశవులు, మహమ్మద్ హుస్సేన్,వెంకట ప్రసాద్, అజ్మతుల్లా, పాల్గొన్నారు.



టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్యను సన్మానిస్తున్న దూదేకుల సంఘం నాయకులు చిన్నరాజ


ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులతో చల్లా రాజగోపాల్ యాదవ్

నిరంతరం శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థి నిరంతరం శ్రమిస్తే లక్ష్యం ఎంతటిదైనా చిన్నబోతుందని, తద్వారా ఏమైనా సాధించవచ్చుని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణాలయ యాదవ సేవ కమిటీ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ మిషన్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కష్టపడి చదివితే దానికి తోడు ఇనిస్టిట్యూట్ వారు ఇచ్చే సూచనలు పాటిస్తే విజయాన్ని అందుకోవచ్చున్నారు. మీరు సాధించే విజయాల ద్వారా ఇన్స్టిట్యూట్ కు మంచి పేరు వస్తుందన్నారు. త్వరలో గ్రూప్-2 నోటిఫికేషన్ వస్తుందని, అందరూ మంచి ర్యాంకు సాధించాలని చల్లా ఆకాంక్షించారు. సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు గ్రూప్-2లో ఫస్ట్ ర్యాంకు సాధిస్తే రూ.1.16 లక్షలు, జోన్ పరిధిలో ఫస్ట్ ర్యాంకు సాధిస్తే రూ.50,116 బహుమతిగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ రెండు ర్యాంకులు మన ఇనిస్టిట్యూట్‌కే రావాలన్నారు. తన కోడలు కూడా గ్రూప్ వన్ ఎగ్జామ్స్ రాసి 8వ ర్యాంకు సాధించి డీఎస్పీ పోస్టు సాధించారన్నారు. ఆమెను కూడా ఇన్స్టిట్యూట్‌కి పిలిపించి గ్రూప్ ఎలా సాధించాలో ఆమెతో సలహాలు ఇప్పిస్తానన్నారు. భవిష్యత్తులో తాను కూడా ఇలాంటి ఇన్స్టిట్యూట్ పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నడపాలనే ఆలోచన ఉందన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ ఫౌండేషన్ అధ్యక్షులు సిద్ధార్థ యాదవ్, హరిత ఫౌండేషన్ అధ్యక్షులు సంజీవరాయుడు యాదవ్, ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుడి చంద్రబాబు, మూరబోయిన శ్రీనివాసులు యాదవ్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు సూలం లక్ష్మీదేవి, టైలర్ ప్రసాద్, నేలటూరు దస్తగిరి బాషా, రామయ్య గౌడ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

సర్పంచ్ బోరెడ్డి వర ప్రసన్న, మదన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు



ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని చిన్నదుద్యాల సర్పంచ్ బోరెడ్డి వర ప్రసన్న, వైసిపి నాయకులు బోరెడ్డి వెంకట మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని వర ప్రసన్న, మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడుతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. వైసిపి బలోపేతానికి మరింత పాటుపడతామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధించేలా సేవ చేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమ విలువైన ఓటును వైసిపి గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వర ప్రసన్న, మదన్ మోహన్‌రెడ్డి కోరారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో రాయలసీమను కరువు సీమగా చెప్పుకుంటూ.. ఎన్నికల తర్వాత ఉపాధి కోసం వలసలు వెళదామన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి యువత బలి అవుతూనే ఉన్నదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని చట్టం చేశారు కదా మరి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఇప్పటికీ ఉక్కు పరిశ్రమకు మూడు ముఖ్యమంత్రులు మూడు శంకుస్థాపనలు, నాలుగు పునాదిరాళ్లు వేశారే తప్ప కనీసం రూ.300కోట్లు కూడా నిధులు కేటాయించకుండా ఉక్కు పరిశ్రమ ఏలా నిర్మాణం పూర్తవుతుందన్నారు. నిధులు కేటాయించకుండా మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చారని వారు విమర్శించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు మహేష్, అంజి, ఎస్ఎఫ్ఐ నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రభుత్వ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక బిసి హాస్టల్లో ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలశాఖ అధ్యక్షుడు రవివర్మ, రాష్ట్ర విద్యార్థి విభాగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, గున్నంపాటి ఇజ్రాయిల్, గున్నంపాటి సల్మాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థి ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


సత్యసింహారెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రాజుపాలెంకు చెందిన సత్యసింహారెడ్డి అంతర్జాతీయ రోప్‌జంప్ పోటీలకు ఎంపిక అవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సత్యసింహారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జిల్లా రచయిత సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహారాష్ట్రలోని షిర్డీలో జరిగిన జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించి.. డిసెంబర్15న థాయిలాండ్‌లో జరిగే పోటీల్లో మన దేశం తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన సత్యసింహారెడ్డికి తల్లిదండ్రులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్ష్మీదేవిలు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడాకారునికి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కోటి ఓబులరెడ్డి రూ.2వేలు, మురుకుంటి ట్రస్ట్ వ్యవస్థాపకులు మురుకుంటి సూర్యనారాయణరెడ్డి రూ.2వేలు విరాళం అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకరించి ప్రోత్సహించాలని వారు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వరకుమారరెడ్డి, రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల అధ్యాపకులు ఆకేపాటి శివశంకర్‌రెడ్డి, పంజగల మధుసూదన్ బాబు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పైపులు నిల్వ.. రైతులకు ఇబ్బందులు

ఏడాది గడుస్తున్నా వాటిని తొలగించని వైనం.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


ప్లాట్‌ఫాంపై నిల్వచేసిన తాగునీటి పైపులు, ప్లాట్‌ఫాంపై ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న రైతులు

ఎర్రగుంట్ల మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి సంబంధించిన నీటి సరఫరా పైపులను నిల్వ చేశారు. వీటిని ప్లాట్‌ఫాంలపై అడ్డంగా పెట్టారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గండికోట నుంచి ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి నిర్మాణం చేపట్టిన నూతన తాగునీటి పైపులైన్ సరఫరా కోసం ఉపయోగించవలసిన పైపులను మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉంచారు. మార్కెట్ యార్డులో ఉన్న మూడు ప్లాట్‌ఫాంలలో ఒకటి పైపులు నిల్వ చేయుటకు ఉపయోగించడంతో మిగిలిన రెండు ప్లాట్‌ఫాంలను మాత్రమే రైతులు పంట నూర్పిళ్లకు వినియోగించుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల అనుమతులు తీసికొని యార్డులోనిప్లాట్‌ఫాంపై భద్రపరచినట్లు అధికారులు చెపుపుతున్నారు. ఏళ్లు గడిచిపోతున్నా నాయకులకు తమ బాధలు పట్టవా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాగుచేసిన పంట ఉత్పత్తులను ఆర బెట్టుకునేందుకు ప్లాట్‌ఫాంలు లేక నేలపై పట్టలు వేసుకుని ఆరబెట్టుకునే పరిస్థితి ఎర్రగుంట్ల మార్కెట్ యార్డ్‌లో దర్శనమిస్తోంది. అడ్డుగా ఉన్న పైపుల కారణంగా చాలామంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం రైతులు పండించిన ఉల్లిపాయలను మార్కెట్ యార్డుకు తరలించి గ్రేడింగ్ ప్రక్రియ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని కూడా మార్కెట్ యార్డులోనే నిర్వహించారు. ఆ సమయంలో కూడా రైతులు శనగ కొనుగోలు కేంద్రానికి తమ పంటను తరలించే క్రమంలో సమయం దాటిన రైతులకు కొనుగోలుదారులు మరుసటి రోజు తూకాలు వేస్తామని చెప్పడంతో చాలామంది రైతులు బస్తాలను ఎక్కడ నిల్వ చేసుకోవాలో తెలియక ఇబ్బందులకు గురైన సందర్భాలున్నాయి. పైపులు నిల్వ చేసి ఏడాది దాటిందని.. రైతులు పండించిన పంటలను ఎక్కడ నిల్వ చేసుకోవాలాంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డ్ రైతుల కోసమా.. కాంట్రాక్టర్ల కోసమా.. అంటూ రైతులు మండి పడుతున్నారు. నెల రోజుల్లో తొలగిస్తామని సంవత్సరం క్రితం చెప్పిన ప్రజారోగ్య అధికారులు ఏమయ్యారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పబ్లిక్‌హెల్త్ అధికారులు చొరవ తీసుకొని రైతులకు ఇబ్బందికరంగా ఉన్న తాగు నీటి పైపులను తొలగించాలని రైతులు కోరు తున్నారు.

వైసిపి అరాచకాలకు టిడిపి నేతలు బలి


మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు వైసిపి నేతల అరాచకాలకు టిడిపి నేతలు అక్రమ కేసులతో బలి అవుతున్నారని కమలాపురం టిడిపి ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి జీవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అక్రమాలపై, టిడిపి నేత నందం సుబ్బయ్య హత్య కేసులో నిజాలు వెలికితీయాలనే ఉద్దేశంతో ధర్నా, నిరసనలు ప్రవీణ్ చేపట్టారన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కూడా ప్రొద్దుటూరుకు వచ్చారన్నారు. నందం సుబ్బయ్య హత్యపై ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే అరాచకాలు ప్రవీణ్ ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కూడా ప్రవీణ్ ఎక్కడికి వెళితే అక్కడ గొడవలు చేశారన్నారు. అందుకు ప్రత్యక్ష సాక్షిని నేనేనని పుత్తా అన్నారు. రౌడీ షీటర్ బెనర్జి ఎమ్మెల్సీ, కౌన్సిలర్లను బెదిరించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. బెనర్జీపై దాడి చేసిన కేసులో భరత్‌కుమార్‌రెడ్డి, రాముపై పోలీసులు చర్యలు తీసుకోకుండా ప్రవీణ్‌పై కేసు నమోదు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది పోలీసుల చేతకానితనమన్నారు. కడపలో కూడా ఇలాంటి సంఘటనే జరిగిందని, వైసిపి నాయకులే గొడవపడితే మధ్యలో టిడిపి నాయకుడు సుబ్బారెడ్డిని ఇరికించారన్నారు. ప్రొద్దుటూరు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ ఇబ్రహీం వైసిపి నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాబోతుందని, ఇలాంటి అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు అరాచకాలపై శనివారం కడపలో ఎస్‌పి సిద్ధార్థ కౌశల్‌కు టిడిపి నాయకులం ఫిర్యాదు చేశామన్నారు. డీజీపీ మన ప్రాంతానికి చెందిన వారే కాబట్టి త్వరలోనే ఆయనను కలసి ఇక్కడి పరిస్థితులను తెలియజేస్తామన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు సంప్రదాయమైన రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జివి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో పారదర్శకత పాటించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు దేవిడ్‌రాజ్

రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీల అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, ఈ ప్రక్రియ పారదర్శకంగా జరపాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ కోరారు. ఏపిపిఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఎలిజిబుల్ టెస్ట్ పరీక్ష నిర్వహించి పోస్టులు భర్తీ చేయాలని డేవిడ్ రాజ్ ఆదివారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 3,220 పోస్టులకు యూనివర్సిటీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చి యూనివర్సిటీలకే ఆ భర్తీ ప్రక్రియను అప్పగించిందన్నారు. రాష్ట్రస్థాయిలో రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఏపీపీఎస్సీ ద్వారా గత ప్రభుత్వం భర్తీ ప్రక్రియను అప్పజెప్పితే ఈ ప్రభుత్వం ఆయా యూనివర్సిటీలకే భర్తీ బాధ్యతలు ఇవ్వడం అనేది అనేక అనుమానాలకు దారితీస్తోందన్నారు. కేవలం అర్హత కోసం మాత్రమే పరీక్షలు నిర్వహిస్తామని, ఇంటర్వ్యూల ద్వారా 1:4 పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ చేపడతామని, అందులో ఇప్పటికే కాంట్రాక్ట్ బేస్ కింద పని చేస్తున్న టీచింగ్ అసిస్టెంట్లకు 10 మార్కులు కలిపి వారికి ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఇలా చెప్పడం వేలాదిమంది నిరుద్యోగులకు నష్టం చేకూర్చేలా ఉందన్నారు. రాజకీయ అండదండలున్న వారికే పోస్టులు దక్కుతాయని నిరుద్యోగుల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై ఇప్పటికే అన్ని యూనివర్సిటీలలో నిరుద్యోగులు కోర్టును ఆశ్రయిస్తున్నారన్నారు. సమావేశంలో షాకీర్, సురేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పజాశక్తి-కలికిరి

మండలంలోని పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ, తహశీల్దార్ భాగ్యలత పరిశీలించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఒ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మం డలంలోని కలికిరి, గుట్ట పాలెం, మర్రిగుంటపల్లి గ్రామంలో డిప్యూటీ కలెక్టర్ గోపాల్ కృష్ణ, తహశీల్దార్ భాగ్యలత తనిఖీ చేసి అక్కడ సక్రమంగా కొత్త ఓటర్లు నమోదు కార్యక్రమం జరుగుతుందా, కొత్త ఓటరు లిస్టులో ఏమైనా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని యువకులందరినీ ఓటరు జాబితాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ విశ్వనాథ, గుట్టపాలెం విఆర్ఒ కదిరప్ప, బిఎల్ఒలు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ గోపాలక్రిష్ణ

మహిళల అభివృద్ధికి పాటుపడాలి

నందలూరు : మహిళల అభివృద్ధికి పాటుపడాలని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. నందలూరు మండల వైసిపి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన పల్లె మాధవిని ఆదివారం ఆమె స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. మహిళలు పార్టీలో ముందుండి నడిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వర్క్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్. వైకాపా నాయకులు ఆకెపాటి రమేష్ రెడ్డి ఎం.దుర్గయ్య, నాగేంద్ర, నాయనపల్లి ఆదినారాయ, పవన్‌కుమార్, మట్టిబాబు, డేవిడ్ కళ్యాణ్ రాజ్ అక్కి వెంకటరమణ పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి సిఎం జగన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాయలసీమ ద్రోహి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావంతో లక్ష ఎకరాలు బీళ్లుగా మిగిలాయన్నారు. రబీలో కూడా అదే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరువుపై సమీక్ష కూడా జరపలేకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఐదు నెలలుగా తీవ్రత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కడప జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కచుక్క కూడా వర్షం పడలేదన్నారు. ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం ముఖ్యమంత్రికి జిల్లా మీద ఎంత ప్రేమ ఉందో రైతులకు అర్థమవుతుందన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 18 మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

హడలెత్తిస్తున్న పందుల బెడద

ప్రజాశక్తి - చాపాడు


సర్వాయిపల్లె రోడ్డులో సంచరిస్తున్న పందులు

మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలను పందుల బెడద తీవ్రంగా వెంటాడుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో 16 వార్డుల వరకు మైదుకూరు పట్టణంలోనే ఉన్నాయి. పట్టణ పరిధిలో అన్ని కాలనీలో పందుల బెడద తీవ్రంగా ఉంది. ముఖ్యంగా బద్వేల్ రోడ్డులోని జోసఫ్‌పేట, శాంతినగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డులోని మసీదు రోడ్డు, రిజిస్టర్ కార్యాలయం రోడ్డు, బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువల వద్ద పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీ సిబ్బంది ఏర్పాటు చేసిన కుండీల వద్ద ఆహార పదార్థాల కోసం కలియతిరుగుతూ ఆ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా, దుర్వాసనకు కారణమవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 120 వరకు నిల్వ ఉండే మురికి కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతుండంతో ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. మున్సిపాలిటీ అధికారులు పలుదఫాలు పందుల యజమానులు పిలిపించి మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేదు. ఇందులో పందుల యజమానులను మున్సిపాలిటీ వర్కర్లుగా విధుల్లోకి తీసుకుంటామని ఖచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. అయితే వాటిని ఒక చోట సంరక్షించుకోకుండా ఇష్టానుసారంగా వదులుతున్నారు. ఈ పరిస్థితుల్లో అవి మురికి కుంటల్లో తిరుగుతున్నాయి. పలురోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇష్టానుసారంగా తిరుగుతున్న పందుల బెడదను తప్పించాలని స్థానికులు, ఆ రోడ్లల్లో ప్రయాణించేవారు కోరుతున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఘనంగా కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లె గ్రామంలో ఆదివారం కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర పాల్గొన్నారు. కొండయ్య స్వామి జన్మదిన కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం.. కొండయ్య స్వామి జన్మదిన వేడుకలకు హాజరైన ప్రజలకు మైదుకూరు పట్టణం బద్వేల్ రోడ్డులోని ఎస్-ఎల్ఆర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.రామఅనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షుగర్, బిపి పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 300వందల మందికి పైగా వైద్య సేవలు పొందారని నిర్వహకులు తెలిపారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకుడు మురళి యాదవ్

బిఎల్ఒలు నిబంధనలను పాటించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వ నిబంధనల మేరకు బిఎల్‌వోలు వ్యవహరించాలని టిడిపి కడప పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లోమడ మురళి యాదవ్ సూచించారు. ఆదివారం మండలంలోని గురజాలలోని 24, 25 పోలింగ్ కేంద్రాలలో ఫామ్ 6,7,8పై బిఎల్‌వో ఓబయ్యతో చర్చించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ అర్హత కలిగిన కొత్త ఓట్లను నమోదు చేయడంతోపాటు గ్రామాల్లో లేని వారికి ఓట్లు తొలగించాలని కోరారు. మరణించిన వారి ఓట్లను కూడా తీసేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంకన్న, శివ, విఆర్ఎ బాబా పాల్గొన్నారు.


సరదాగా పొంగనాలు వేస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాదరణ ఓర్వలేకనే చంద్రబాబుపై అక్రమ కేసులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్ర రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి విమర్శించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని వలసపల్లె రోడ్డులో షాదీఖానా దగ్గర నుంచి ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ బాబుకు పజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయిస్తున్న ఈ సైకో ప్రభుత్వం దిగిపోవాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకో పోవాలి.. సైకిల్ రావాలి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. పనిచేసే కార్యకర్తను తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని భరోసానిచ్చారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రతి గడప తిరుగుతూ వివరించారు. కరపత్రలను పంచుతూ స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంతో అందరి సమస్యలు పరిష్కరిస్తానని భూపేష్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బయపురెడ్డి, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, చాంద్, శివారెడ్డి, సేట్, టైలర్ మాబు, మల్లేష్, నాగరాజు, సూరి, సంజీవరెడ్డి, రామసుబ్బయ్య, సుబ్బారెడ్డి, మస్తాన్వలి, రఘు, వెంకటేష్, సాంబ, ఖాసీం వల్లి, గంగరాజు, నాగరాజు, రసూల్, మహీంద్రా వర్మ, ప్రేమ్‌చంద్, వెంకటేష్, రామాంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంగనాలు పోస్తూ.. స్థానిక మున్సిపాలిటీ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పర్యటిస్తున్న భూపేష్ ఓ హెూటల్లో సరదాగా పొంగనాలు వేస్తూ వేశారు. హెూటల్ యజమానులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు.


ప్రచార రథం వద్ద దళిత సంఘాల నాయకులు

11న మాదిగల విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు ఈనెల 11న హైదరాబాద్‌లో జరప తలపెట్టిన మాదిగ, మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని దళిత సంఘాల నేతలు కోరారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నుండి ఎమ్మార్పీఎస్ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దండోరా ప్రచార రథాన్ని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా దళిత నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ మంగ దొడ్డి సింగరయ్య, బిజెపి దళిత మోర్చా రాష్ట్ర నాయకులు మేకల ఆంజనేయులు, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్ప పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా హాజరై వర్గీకరణకు అనుకూల ప్రకటన చేస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి భారీగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నందున ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. దేవగుడిలో ప్రచారరథంతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కె. బాల ఓబయ్య, ప్రధాన కార్యదర్శి మబ్బు గురుస్వామి, ఓబులేసు, కొండయ్య, నియోజకవర్గ ఇన్చార్జి వై.చిన్నయ్య, జిల్లా నాయకులు నరసింహులు, చంద్రకుమార్, బొంతల ఓబులేసు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నియోజకవర్గం అధ్యక్షులు జి.రవీంద్ర, మైలవరం మండల నాయకులు నాగన్న, నాగరాజు, జమ్మలమడుగు మండలం నాయకులు రవికుమార్, రాజు, చందు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - రామాపురం

వీరబల్లి మండలం పుత్తావాండ్లపల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సిరిగిరి శ్రీనివాసులు రెడ్డి జన్మదినం సందర్భంగా విఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ సురేంద్రారెడ్డి మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం చాలా సంతృప్తి దాయకమన్నారు. వారిని చిన్నచూపు చూడకుండా సేవ చేసినప్పుడే సరైన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. తుమ్మల రమేష్, చలమారెడ్డి, ఆశ్రమం మేనేజరు దేవనాథరెడ్డి, కోఆర్డినేటర్ ఏ.వి.సుబ్బయ్య పాల్గొన్నారు.